సాక్షి
అనంతపురం

శుక్రవారం । 8 । నవంబర్ । 2024



టన్ను చీనీ రూ.32 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు పలికాయి.



కిలో టమాట రూ.30

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.24 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.4°/17.6°

జిల్లా అంతటా గురువారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

అనంత టీడీపీలో అగ్గి!

అధికారంలోకి వచ్చీరాగానే వారిద్దరి మధ్య వివాదాలు మొదలయ్యాయి. సామాజిక మాధ్యమాల ద్వారా పోట్లాడుకోవడం ప్రారంభించారు. ఒకరిపై ఒకరు అధిష్టానానికి ఫిర్యాదులు చేసుకున్నారు. తన వైరికి పదవి దక్కకుండా అందులో ఒకరు సఫలీకృతులయ్యారు. ఒకే పార్టీలోనే ఉన్నా ఎవరికి వారే అన్నట్లుగా రాజకీయాలు చేస్తుండటంతో కిందిస్థాయి శ్రేణులు తలలు పట్టుకుంటున్నారు.

- కత్తులు దూసుకుంటున్న దగ్గుపాటి, ప్రభాకర్ చౌదరి వర్గీయులు
- గతంలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై మాటల యుద్ధం
- తాజాగా మద్యం షాపుల ఏర్పాటులో రాజుకున్న వివాదం
- ఒకరిపై ఒకరు అధిష్టానానికి ఫిర్యాదులు
- చౌదరికి నామినేటెడ్ పోస్ట్ రాకుండా చేయడంలో దగ్గుబాటి సక్సెస్
- ఇద్దరి మధ్య వివాదాలతో నలిగిపోతున్న తమ్ముళ్లు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అధికార టీడీపీలో రోజురోజుకూ అగ్గి రాజుకుంటోంది. కూటమి సర్కారు కొలువు దీరి ఐదుమాసాలు కూడా పూర్తికాకముందే నేతలు సొంత కుంపట్లు పెట్టుకుని వివాదాలకు ఆజ్యం పోస్తున్నారు. ఇద్దరూ ఒకే సామాజిక వర్గం, ఒకే పార్టీ అయినా విభేదాలు భగ్గుమంటున్నాయి. ఇప్పటికే ధర్మవరం, పెనుకొండ, శింగనమల నియోజక వర్గాల్లో వర్గపోరు తీవ్ర స్థాయిలో ఉన్న నేపథ్యంలో ఇప్పుడు అనంతపురం అర్బన్‌లో జరుగుతున్న పరిణామాలు అధికార పార్టీ కార్యకర్తలకు మింగుడు పడటం లేదు.

గెలిచినప్పటి నుంచి కోల్డ్‌వార్..

2014లో ఎమ్మెల్యేగా గెలిచి 2019లో ఓడిపోయిన ప్రభాకర్ చౌదరిని కాదని 2024లో దగ్గుపాటి ప్రసాద్‌కు టీడీపీ అధిష్టానం టికెట్ కేటాయించింది. దీంతో అప్పట్లో నగరంలోని టీడీపీ కార్యాలయానికి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అనుచరులు నిప్పు పెట్టారు. ఆ తర్వాత మళ్లీ సర్దుకున్నా పార్టీకి ఎన్నికల్లో పనిచేయలేదు. ఇదే క్రమంలో ఎన్నికల్లో దగ్గుపాటి ప్రసాద్ గెలిచారు. అప్పటినుంచి ఇద్దరి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తూనే ఉంది. అనుచరుల మధ్య కూడా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ప్రభాకర్ చౌదరికి నామినేటెడ్ పోస్టు రాకుండా దగ్గుపాటి ప్రసాద్ అడ్డుకున్నారని చౌదరి వర్గీయులు ఆరోపిస్తున్నారు.

అలా మొదలైంది..

వైకుంఠం, దగ్గుపాటి మధ్య పీడీఎస్ బియ్యం నిప్పు రాజేశాయి. తొలుత దగ్గుపాటి వర్గీయులు బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని వార్తలొచ్చాయి. మీడియాలో ఈ విషయం సంచలనంగా మారింది. వీటిని ప్రభాకర్ చౌదరే బయట పెట్టించారని అనుమానించిన ఎమ్మెల్యే వర్గీయులు పాతూరులో అక్రమ బియ్యం నిల్వ ఉంచిన గోడౌన్‌ను అధికారులతో తనిఖీ చేయించగా.. దీనిపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. అయితే, ప్రభాకర్ చౌదరి అనుచరులే సోషల్ మీడియాలో ప్రచారం చేయించారని వార్తలొచ్చాయి. దీంతో ఎమ్మెల్యే దగ్గుపాటి, వైకుంఠం మధ్య వివాదం రేగింది. ఈ క్రమంలో బియ్యం అక్రమ రవాణాపై ప్రభాకర్ చౌదరి ఏకంగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నేత అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాని తీవ్ర ఆరోపణలు చేశారు.

మద్యం షాపుల్లో రెండు వర్గాలు..

మద్యం షాపుల ఏర్పాటుకు ఇటీవల నిర్వహించిన లాటరీలో అనంతపురం ఎమ్మెల్యే వర్గానికి ఆరు షాపులు దక్కాయి. మరో నాలుగు షాపులను ఆయన సొంతం చేసుకోగలిగారు. అంత వరకూ బాగానే ఉన్నా.. మరికొన్ని షాపుల్లో పర్సెంటేజీ ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నట్టు ప్రభాకర్ చౌదరి వర్గీయులు ఆరోపిస్తున్నారు. దగ్గుపాటి వ్యతిరేక వర్గంలో షాపులు దక్కించుకున్న వారు ప్రభాకర్ చౌదరిని ఆశ్రయించారు. దీంతో షాపుల నిర్వహణ వివాదం పతాక స్థాయికి చేరింది. దీనిపై లోకేష్, చంద్రబాబుకు ప్రభాకర్ చౌదరి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. మరోవైపు ప్రభాకర్ చౌదరి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, పార్టీకి తీవ్ర నష్టం కలుగుతోందంటూ అధిష్టానానికి దగ్గుపాటి వర్గీయులు ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇద్దరు ముఖ్య నేతల మధ్య వివాదం రోజురోజుకూ తీవ్రంగా మారుతుండటంతో తెలుగు తమ్ముళ్లు నలిగిపోతున్నారు.

ఇంత నిర్లక్ష్యంగా పనిచేస్తే ఎలా?

అనంతపురం అర్బన్: 'ఇంత నిర్లక్ష్యంగా పని చేస్తే ఎలా? ఇలాగైతే నిర్దేశించిన పనులు గడువులోగా ఎలా పూర్తవుతాయి. అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలి' అంటూ అపార్ అఫ్లేషన్‌పై కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో 3.71 లక్షల మంది విద్యార్థులు ఉంటే ఇప్పటి వరకు 1.90 లక్షల మంది అపార్ అఫ్లేషన్ చేశారని, మిగిలిన 1.81 లక్షల మంది అఫ్లేషన్ త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి విద్యా శాఖ, సమగ్ర శిక్ష అధికారులు, ఎంఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ అఫ్లేషన్ ప్రక్రియలో ఆటంకాలను అధిగమించేందుకు విద్యాశాఖ అధికారులు, ఆధార్ నోడల్ అధికారి సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యార్థుల జనన ధ్రువీకరణ పత్రాల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. నకిలీ పత్రాలు జారీ చేసే వారిపైన, వాటిని తెచ్చి అవకతవకలకు పాల్పడే వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ కచ్చితంగా 2,500 మంది విద్యార్థుల అపార్ అఫ్లేషన్ చేయాలని కలెక్టర్ చెప్పారు. కాన్ఫరెన్స్‌లో డీఈఓ ప్రసాద్‌బాబు, డీవీఈఓ వెంకటరమణనాయక్, ఏడీ నాగరాజు, సీఎంఓ గోపాల్, ఏపీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో వెంటనే చేరాలి

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ పోస్టులకు ఎంపికైన వారు వెంటనే విధుల్లో చేరాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల 5 అంగన్‌వాడీ వర్కర్స్, 2 మినీ అంగన్‌వాడీ వర్కర్స్, 71 హెల్పర్స్ పోస్టులను భర్తీ చేసినట్లు వివరించారు. ఎంపికైన వారికి ఆయా సీడీపీఓల ద్వారా నియామక ఉత్తర్వులు అందజేసినట్లు పేర్కొన్నారు. వారంతా వెంటనే విధుల్లో చేరాలని సూచించారు.

న్యూస్‌రీల్

రైతు బజార్‌లో వంటనూనె కౌంటర్ మూత

- పది రోజులకే మూసేసిన వైనం



అనంతపురం అగ్రికల్చర్: స్థానిక రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన వంటనూనె విక్రయ కేంద్రం మూసేశారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరిగిన నేపథ్యంలో వినియోగదారులకు తక్కువ రేటుకే అందుబాటులోకి తెస్తామంటూ అక్టోబర్ 10న ఘనంగా ప్రారంభించిన కౌంటర్ కేవలం పది రోజులకే మూత పడటం గమనార్హం. కిలో పామాయిల్ రూ.110, కిలో సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124 ప్రకారం అందిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ గొప్పగా ప్రారంభించిన విషయం తెలిసిందే. పౌరసరఫరాలశాఖ, మార్కెటింగ్ శాఖ సహకారంతో ఆయిల్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధరలు తగ్గేదాకా కౌంటర్ నిర్వహిస్తామని చెప్పారు. రెండు మూడు రోజుల తర్వాత కేంద్రం పనిచేస్తుందంటూ చెబుతూ వస్తున్నా 15 రోజులుగా నిరవధికంగా మూతబడటం విశేషం.

డీఎస్సీ ఉచిత శిక్షణకు పరీక్ష 10న

అనంతపురం రూరల్: డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10న పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామాంజినేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో పాటు ఆధార్, పాన్, ఓటరు గుర్తింపు కార్డు వంటి ధ్రువీకరణ పత్రాలు తీసుకు రావాల్సి ఉంటుందన్నారు. https://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440027718, 9963296433 నంబర్లను సంప్రదించాలన్నారు.

పసికందులకు మెరుగైన వైద్యం అందించాలి



శిశువు స్క్రీనింగ్‌ను పరిశీలిస్తున్న న్యాయమూర్తి శివప్రసాద్‌యాదవ్

అనంతపురం మెడికల్: పసికందులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్ సూచించారు. ప్రపంచ నవజాత శిశు సంరక్షణ దినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీలో బరువు తక్కువ, నెలలు నిండని పసికందులకు కడప పుష్పగిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో స్క్రీనింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ.. గర్భం దాల్చినప్పటి నుంచి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని గర్భిణులకు సూచించారు. ఆ దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. అనంతరం రెడ్‌కామ్ అనే పరికరం ద్వారా 27 మంది పసికందులకు పరీక్షలు చేయగా, 11 మందికి సమస్యలున్నట్లు గుర్తించారు. రెండు వారాల తర్వాత రెటీనా మెచ్యూరిటీ పొందకపోతే వీరికి ఉచితంగా చికిత్స చేయించేలా చర్యలు తీసుకుంటామని పుష్పగిరి ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తాడిపత్రి రూరల్: స్థానిక పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. పెన్నానది నుంచి నంద్యాల జిల్లాకు గురువారం ఉదయం ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

యల్లనూరు మండలంలో మరొకటి...

యల్లనూరు: మండలంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుకను వైఎస్సార్ జిల్లా పులివెందులకు తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీరాం ప్రసాద్ తెలిపారు. అందిన ముందస్తు సమాచారంతో శింగవరం గ్రామ సమీపంలో గురువారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఆ సమయంలో అటుగా ఇసుక లోడుతో వచ్చిన ట్రాక్టర్‌ను అడ్డుకుని పరిశీలిస్తే ఎలాంటి అనుమతులు లేవని తెలిసిందన్నారు. దీంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి, యజమాని గోవర్ధన్ నాయుడు, డ్రైవరు రామాంజినేయులుపై కేసు నమోదు చేశామన్నారు.

అంతులేని అరాచకాలు

- హామీలు అమలు చేయాలని కోరితే అరెస్టులు చేసి హింసిస్తారా?
- సుప్రీం ఆదేశాలు పాటించిన ఎస్పీపై చర్యలు శోచనీయం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపాటు
- సీఎస్, డీజీపీ చరిత్రహీనులు కావొద్దని హితవు
- వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా ఉంటామని స్పష్టీకరణ



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'ఐదు నెలల కూటమి ప్రభుత్వంలో అంతులేని అరాచకాలతో రాష్ట్రం అరాచక ఆంధ్రప్రదేశ్ దిశగా వెళ్తోంది. కూటమి ప్రభుత్వ హామీలపై వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తే పోలీసులు అరెస్టులు చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారు. డీజీపీ, సీఎస్‌లు రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాలి. లేని పక్షంలో చరిత్ర హీనులుగా మిగిలిపోతారు' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీజీపీ, సీఎస్‌లకు పరిపాలనలో అపార అనుభవం ఉందని, రాజ్యాంగాన్ని పరిరక్షించి చట్టపరంగా ముందుకు వెళ్లాలన్నారు. డీజీపీ ద్వారకా తిరుమల రావు రెడ్‌బుక్ రాజ్యాంగం కాకుండా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలన్నారు. అధికారులు శాశ్వతమని, అధికార పార్టీకి తొత్తులుగా మారొద్దని హితవు పలికారు. సమర్థవంతమైన అధికారిగా పేరొందిన హర్షవర్ధన్ రాజును కూటమి ప్రభుత్వం వచ్చాక కడప ఎస్పీగా నియమించారని తెలిపారు. అలాంటి వ్యక్తిని నేడు అన్యాయంగా బదిలీ చేసి అధికారులను గుప్పిట్లో పెట్టుకోవాలని భావిస్తుండటం శోచనీయమన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు తమ మాట వినడం లేదని కేబినెట్ సమావేశంలో చర్చించుకోవడం సిగ్గుచేటన్నారు. అసలు ఐఏఎస్, ఐపీఎస్‌లకు మీరు ఏం చెబుతున్నారు? వాళ్లు ఏం వినడం లేదో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. అరాచకాలకు పాల్పడాలని వాళ్లకు చెబుతున్నారా? అని ప్రశ్నించారు.

ప్రశ్నిస్తే అరెస్టులా..

సుప్రీంకోర్టు ఆదేశానుసారం ముందుగా 41ఏ కింద నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కానీ ఈ ప్రభుత్వం కోర్టు ఆదేశాలు ఉల్లంఘిస్తోందన్నారు. ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పి నేడు ప్రజలపై రూ.17 వేల కోట్ల భారం వేస్తున్నారని, యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోందని, మద్యం ఏరులై పారిస్తున్నారని, ఈ క్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, బీజేపీ నాయకులు ఇచ్చిన హామీలను సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తే కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారన్నారు. బెళుగుప్ప మండలం నక్కలపల్లిలో వైఎస్సార్ సీపీ కార్యకర్త సంజీవరెడ్డిని ఈ నెల 6న పుట్టపర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసిందని, దీనిపై అక్కడి డీఎస్పీతో తాను మాట్లాడితే తమ వద్ద లేరని అంటున్నారన్నారు. అరెస్టు చేసిన వారిని ఎక్కడ ఉంచారో కూడా తెలియకుండా భయభ్రాంతులకు గురి చేయడం హేయమన్నారు. ఈ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, ఎంతవరకైనా వెళ్తామని ఆయన హెచ్చరించారు. పార్టీ శ్రేణులకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పార్టీ అండగా ఉంటారన్నారు. ఎక్కడైనా అక్రమ కేసులు నమోదు చేస్తే ధైర్యంగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ వినోద్‌కుమార్



ఫోన్‌ఇన్ కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: భూ సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు చేపడతామని కలెక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ఆల్ ఇండియా రేడియో (ఏఐఆర్) స్టేషన్‌లో గురువారం ఉదయం ఆకాశవాణి అనంతమిత్ర ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన వినతులను పరిష్కరిస్తామన్నారు. చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు సంబంధిత వ్యక్తులు సచివాలయం లేదా మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం విచారణ చేసి జాబితా నుంచి తొలగిస్తామన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- పామిడి మండలం అనంపల్లికి చెందిన భాస్కర్ తన సమస్యను విన్నవించాడు. తన మామ బుషప్ప చనిపోయి రెండేళ్లు అయ్యిందని, ఆయన పేరున ఉన్న 1.50 ఎకరాల భూమిని తమ అత్త పేరున మార్చేందుకు ఎన్నిసార్లు అర్జీ ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని చెప్పాడు.
- తాడిపత్రి మండలం బొమ్మసంద్రం నాగార్జున తన సమస్యను తెలియజేశాడు. తన తండ్రి చనిపోయాడని, ఆయన పేరున ఉన్న భూమిని తల్లి పేరు మీదకు మార్చి పట్టా ఇప్పించాలని కోరాడు.
- కంబదూరు మండల కేంద్రంలోని 90 అడుగుల ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణలకు గురైందని ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీంతో బస్సులు మండల కేంద్రానికి రాకుండా ఊరిబయటి నుంచే వెళ్లిపోతున్నాయని, ఆక్రమణలను తొలగించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశాడు.

ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపులు

జిల్లాలో 2025, జనవరి 1వ తేదీనాటికి 18 ఏళ్లు నిండనున్న యువత ఈనెల 28వ తేదీలోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. వివరాలను ఆయన గురువారం తెలియజేశారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఈనెల 9, 10వ తేదీలు, అదేవిధంగా 23, 24వ తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నామన్నారు. బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటరు నమోదు (ఫారం-6), ఓటు తొలగింపు (ఫారం-7), వివరాల మార్పునకు (ఫారం-8) దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. అంతే కాకుండా ఈఆర్ఓ, ఏఈఆర్ఓగా వ్యవహరిస్తున్న తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, బీఎల్ఓల కార్యాలయంలో దరఖాస్తు ఫారం సమర్పించవచ్చన్నారు. నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్ (ఎన్‌వీఎస్‌పీ)లో ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు సమర్పించవచ్చని సూచించారు. దీనిపై మరింత సమాచారం, సహాయం కోసం కలెక్టర్ కార్యాలయంలోని టోల్ ఫ్రీ నంబరు 1950 ద్వారా సంప్రదించవచ్చన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శుక్రవారం జరగనున్నాయి. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ప్రధాన సమావేశ భవన్‌లో ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నారు. స్థాయీ సంఘం-1, 2, 3, 4, 5, 6, 7(ఆర్థిక,ప్రణాళిక/ఇంజినీరింగ్ శాఖ/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/మహిళా, శిశు సంక్షేమం/వ్యవసాయం/ సాంఘిక సంక్షేమ) శాఖల సమావేశాలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సమక్షంలో ఆయా స్థాయీ సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో ప్రారంభం కానున్నాయి. గత సమావేశంలో చర్చించిన అంశాలు, సభ్యులు లేవనెత్తిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించి సమగ్ర సమాచారంతో ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఆదేశించారు. గతంలో రెండ్రోజుల పాటు నిర్వహించే సమావేశాలు ఇటీవల ఒకే రోజే ముగించేస్తున్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 60 రోజులకు ఒకసారి నిర్వహించాల్సిన స్థాయీ సంఘాల సమావేశాలు కొంతకాలంగా సక్రమంగా నిర్వహించకపోవడం తెలిసిందే.

● అపర సంజీవనికే ఆపత్కాలం!




ఆపదలో ఉండి ఫోన్ చేసిన క్షణాల్లోనే ఉన్నచోటుకు వాలిపోయి ప్రాణాలు కాపాడుతున్న 108 వాహనాలకే పెద్ద ప్రమాదం వచ్చి పడింది. కూటమి పాలకుల కర్కశ మనస్తత్వం పుణ్యమా అని ఆపత్కాలం ఎదుర్కొంటోంది. పేదలపై కక్ష కట్టిన ప్రభుత్వం వాహనాల నిర్వహణ ఖర్చులకు డబ్బు విదల్చకపోవడంతో అంపశయ్యపైకి జారుకుంటోంది. మరోవైపు జీతాలు అందక 108 డ్రైవర్లు అల్లాడిపోతున్నారు. గురువారం అనంతపురం సమీపంలోని ఆలమూరు నుంచి వస్తుండగా బ్యాటరీ మరమ్మతులకు గురై ఆగిపోవడంతో ఇదిగో ఇలా డ్రైవర్లు అవస్థలు పడుతూనే నగరంలోకి తోసుకువచ్చారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ఒక కనెక్షన్‌కే ఉచిత గ్యాస్

- దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు
- జిల్లాలో 5.05 లక్షల మంది అర్హులు గుర్తింపు
- జేసీ శివనారాయణశర్మ

అనంతపురం అర్బన్: ఒక గృహంలో బహుళ గ్యాస్ కనెక్షన్లు ఉన్నప్పటికీ ఒక కనెక్షన్‌కే ఉచిత గ్యాస్ పథకం వర్తిస్తుందని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ స్పష్టం చేశారు. కనెక్షన్ దీపం-2 పథకం కింద తప్పనిసరిగా లింక్ అయి ఉండాలని చెప్పారు. జిల్లాలో ఉచిత గ్యాస్ పథకం అమలు తీరుపై జాయింట్ కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఎస్ఓ వెంకటేశ్వర్లుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పథకం కోసం ఎలాంటి దరఖాస్తు చేసుకోవాల్సిన పనిలేదన్నారు. ఆధార్‌కార్డు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే గ్యాస్ కనెక్షన్‌కు వినియోగదారుల ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా అనుసంధానం చేసి ఉంటారన్నారు. కాబట్టి అర్హులైన వారందరికీ ఆధార్ లింక్ చేసి మొబైల్ నంబర్‌కు గ్యాస్ బుక్ అయినట్లు ఎస్ఎంఎస్ వస్తుందన్నారు. సిలిండర్ వినియోగదారునికి అందించిన 48 గంటల్లో రాయితీ మొత్తం వారి బ్యాంక్ ఖాతాల్లో జమవుతుందన్నారు. పథకం కింద జిల్లాలో 5,05,831 మంది వినియోగదారులకు ఉచిత గ్యాస్ పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు అందిస్తామన్నారు. ఈనెల 6వ తేదీ వరకు సిలిండర్ కోసం 93,128 మంది బుకింగ్ చేసుకోగా 55,925 మందికి పంపిణీ చేశారన్నారు. మిగిలిన వారికి త్వరలో పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలో అర్హత కలిగిన వారికి శాఖాపరంగా ఉన్న రేషన్ కార్డుల డేటాతో సరిపోల్చి జాబితాలను ఆయిల్ కంపెనీలకు, అదే విధంగా నియోజకవర్గాల వారీగా ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, గ్యాస్ ఏజెన్సీలకు పంపించామన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శివనారాయణ శర్మ

గ్యాస్ అక్రమ వినియోగంపై కొరడా

గృహావసర (డొమెస్టిక్) గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిపై పౌర సరఫరాల శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ఏకంగా 86 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. 54 కేసులు నమోదు చేశారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశాల మేరకు డీఎస్ఓ టి.వెంకటేశ్వర్లు నేతృత్వంలో అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి గురువారం అనంతపురం నగర పరిధిలోని వివిధ హోటళ్లు, రెస్టారెంట్లు, ప్రైవేటు హాస్టళ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 29 హెచ్‌పీసీ, 28 బీపీసీ, 29 ఐఓసీ మొత్తం 86 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధించి 54 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్ఓ మాట్లాడుతూ డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించడంతో పాటు కేసులు నమోదు చేసి భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

మాతృ మరణాలు అరికట్టేలా ప్రత్యేక ప్రణాళిక



పీహెచ్‌సీలో అందిస్తున్న సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

కూడేరు: ప్రసవ సమయంలో మాతృ మరణాలు చోటు చేసుకోకుండా అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పీహెచ్‌సీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాన్పులు, రోగుల వార్డులు, వ్యాక్సిన్, మందులు నిల్వ ఉంచిన గదులను పరిశీలించారు. నెలలో పీహెచ్‌సీలో నమోదయ్యే కేసుల నివేదికను ఇవ్వకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారి తనిఖీకి వచ్చినపుడు ఇవ్వాలని సిబ్బందికి చెప్పరా అని జిల్లా వైద్యాధికారిణి భ్రమరాంబ దేవిని ప్రశ్నించారు. ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలందించాలని సిబ్బందికి ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది కచ్చితంగా డ్రస్ కోడ్ పాటిస్తూ గుర్తింపు కార్డులను మెడలో వేసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో సీహెచ్‌ఓల ద్వారా గర్భిణులకు అవగాహన కల్పిస్తామన్నారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు. అనంతపురం సర్వజనాస్పత్రిలో ఒక్కో వారం ఒక పీహెచ్‌సీ డాక్టర్‌కు ప్రసూతి విభాగంలో శిక్షణ ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు లక్ష్మీనారాయణ, సౌమ్యారెడ్డి, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, సర్పంచులు లలితమ్మ, హనుమంత రెడ్డి పాల్గొన్నారు.

26 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మూడు, ఐదు, ఏడు సెమిస్టర్ పరీక్షలు నవంబర్ 26 నుంచి ప్రారంభం కానున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. మెగా సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేవారు సైతం రెగ్యులర్ వారితో పాటు పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలన్నారు.

అనంత ఆణిముత్యాలు పునరుద్ధరణ

- చర్యలు చేపట్టాలని ఆదేశించిన కలెక్టర్ వినోద్‌కుమార్





అనంతపురం అర్బన్: జిల్లాలో సామాజికంగా, ఆర్థికంగా వెనుబడిన వర్గాల్లోని పేదవిద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు 2008లో అప్పటి కలెక్టర్ ఎస్.శ్రీధర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అనంత ఆణిముత్యాలు' ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఏర్పాటు చేశారు. అమలుకు ఒక కమిటీ నియమించారు. సొసైటీ ద్వారా పలువురు విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించారు. ఆయన బదిలీపై వెళ్లిన అనంతరం మూడు, నాలుగేళ్ల పాటు ఈ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం కొనసాగించింది. అటు తరువాత వచ్చిన వారు దృష్టి సారించకపోవడంతో కార్యక్రమం ముందుకు సాగలేదు. మళ్లీ ఇన్నేళ్ల తరువాత 'అనంత ఆణిముత్యాలు' కార్యక్రమం పునరుద్ధరణకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ చర్యలు చేపట్టారు. కార్యక్రమం అమలుపై కలెక్టర్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. 'అనంత ఆణిముత్యాలు' పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లాలో ఎవరైనా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి, చదువుకునేందుకు ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థులను గుర్తించి కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యాభివృద్ధికి ఆర్థిక సాయం చేయలంటూ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమర్పిస్తున్న అర్జీలను పరిశీలించాలన్నారు. వాటిలో నిజంగా అర్హులు ఉంటే వారికి సాయం అందించేందుకు ఉన్న అవకాశాలనూ పరిశీలించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎ.మలోల, డీఈఓ ప్రసాద్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, బీసీ సంక్షేమశాఖ డీడీ ఖుష్బూకోఠారి, డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, ఎల్‌డీఎం నర్సింగరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, ఏపీఓ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ఫీజు చెల్లించేందుకు ఆమోదం

ఓ విద్యార్థి బ్యాంక్ పరీక్షల కోచింగ్‌కు ఫీజు చెల్లించేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. బీసీ సంక్షేమ శాఖలో ఎస్సీ వర్గానికి చెందిన కె.వెంకటేశ్వర్లు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన కుమార్తె కె.రాణి బ్యాంక్ పరీక్షల శిక్షణకు ఆర్థిక సాయం చేయాలని దరఖాస్తు చేసుకుంది. దీనిపై తహసీల్దారు, ఆర్‌డీఓ విచారణ చేసి నివేదిక ఇచ్చారు. దీంతో ఆ విద్యార్థినికి నంద్యాలలోని గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ ఫీజు చెల్లించేందుకు కమిటీ ఆమోదం తెలిపింది.

సొసైటీ కమిటీ ఇదే

అనంత ఆణిముత్యాలు ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీని 2008 ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కలెక్టర్, ఉపాధ్యక్షుడిగా జాయింట్ కలెక్టర్ ఉంటారు. ప్రధాన కార్యదర్శిగా డీఆర్‌ఓ, సంయుక్త కార్యదర్శిగా డీఆర్‌డీఏ పీడీ, కోశాధికారిగా కలెక్టరేట్ పరిపాలనాధికారి, కార్యనిర్వాహక సభ్యులుగా బీసీ సంక్షేమశాఖ డీడీ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ, ఎల్‌డీఎం ఉంటారు.

మున్సిపల్ టీచర్ల వివరాలివ్వండి

- మునిసిపల్ ఆర్డీకి విద్యాశాఖ లేఖ
- పదోన్నతులు చేపట్టాలంటే వివరాలు తప్పనిసరి
- మునిసిపల్ స్కూల్ టీచర్ల వివరాలు లేవంటూ వెల్లడి

అనంతపురం ఎడ్యుకేషన్: 'నగరపాలక సంస్థ, ఉమ్మడి జిల్లాలోని మునిసిపల్ స్కూళ్లలో పని చేస్తున్న టీచర్లకు సంబంధించి ఎలాంటి వివరాలు తమవద్ద లేవు. దీంతో పదోన్నతుల ప్రక్రియకు తీవ్ర ఇబ్బందిగా ఉంది...మీ వద్ద ఉన్న పూర్తిస్థాయి వివరాలు వెంటనే ఇవ్వాలి' అంటూ జిల్లా విద్యాశాఖ అధికారి.. మునిసిపల్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ)కి గురువారం లేఖ రాశారు. మునిసిపల్ స్కూళ్లల్లో పని చేస్తున్న టీచర్లకు పదోన్నతుల అంశంపై ప్రభుత్వం హడావుడి ప్రకటన చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ఇప్పటిదాకా అమలు చేసిందేమీలేదు. 2021 డిసెంబర్ తర్వాత పదోన్నతులు చేపడుతున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించి షెడ్యూలూ విడుదల చేసింది. దీంతో ఆశావహులు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. షెడ్యూలు ప్రకారం బుధవారం ప్రధానోపాధ్యాయులు, నేడు (శుక్రవారం) స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది.

అనంతపురం నగరపాలక సంస్థ ఒక యూనిట్‌గా, ఉమ్మడి జిల్లాలోని ఆరు మునిసిపాలిటీలు ఒక యూనిట్‌గా పదోన్నతులు చేపట్టనున్నారు. మునిసిపల్ టీచర్ల వివరాలు విద్యాశాఖ వద్ద లేకపోవడంతో గత నెల 28న ప్రకటించాల్సిన తాత్కాలిక సీనియార్టీ జాబితాను ఈనెల 1న ప్రకటించారు. అదికూడా తూతూమంత్రంగా పాతజాబితాను ప్రదర్శించారు. దీనిపై అభ్యంతరాలు స్వీకరించారు. అభ్యంతరాలు సరిచేశారు. ఖాళీల లెక్క తేలింది. అనంతపురం కార్పొరేషన్‌లో మూడు, మునిసిపాలిటీల్లో మూడు హెచ్‌ఎం పోస్టులు ఖాళీలున్నట్లు గుర్తించారు. స్కూల్ అసిస్టెంట్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులు రెండు యూనిట్లలోనూ దాదాపు 10–12 దాకా ఉన్నట్లు (పదోన్నతుల కోసం) గుర్తించారు.

వివరాలు లేక ఆగిన కౌన్సెలింగ్

నగరపాలక సంస్థతో పాటు ఆయా మునిసిపాలిటీలకు ఎన్ని పోస్టులు మంజూరయ్యాయి, పని చేస్తున్న పోస్టులు, ప్రస్తుతం ఖాళీలు, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎన్ని పోస్టులు భర్తీ చేశారు, పదోన్నతులకు ఎన్ని పోస్టులు ఇచ్చారు? రోస్టర్‌కు సంబంధించి ఏసైకిలు ఎక్కడిదాకా ఆగిపోయింది తదితర వివరాలేవీ విద్యాశాఖ వద్ద లేవు. తరచూ మునిసిపల్ ఆర్డీ కార్యాలయానికి వెళ్లి అడుతున్నా వారినుంచి సరైన స్పందన లేదు. దీంతో పై వివరాలను కోరుతూ విద్యాశాఖ అధికారులు అధికారికంగా లేఖ రాశారు. ఆ వివరాలు వచ్చిన తర్వాత పరిశీలించి పదోన్నతులు చేపడతామని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు.

ప్రారంభ దశలోనే గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: ప్రారంభ దశలోనే క్యాన్సర్ వ్యాధిని గుర్తించేందుకు ముందస్తు స్క్రీనింగ్ ఎంతో దోహదపడుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి అన్నారు. తద్వారా వ్యాధి నివారణ సాధ్యమవుతుందన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన ర్యాలీను ఆమె ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు, అక్కడి నుంచి డీఎంహెచ్‌ఓ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. ప్రస్తుత 34 శాతం వరకు రొమ్ము, నోటి క్యాన్సర్ బాధితులు ఉన్నట్లు అంచనా ఉందన్నారు. ఇవన్నీ ప్రాథమిక దశలోనే గృహ సందర్శన చేసి 30 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. అనుమానిత కేసులను హయ్యర్ ఇన్‌స్టిట్యూట్‌కు రెఫర్ చేస్తామన్నారు. ఈ నెల 14న ప్రభుత్వం ఇంటింటి సర్వే చేపట్టేలా కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. పొగాకు, మందు, మాదక ద్రవ్యాలు తదితర వాటికి దూరంగా ఉండి, మంచి ఆహార అలవాట్లు, యోగా, వ్యాయామం, తదితర వాటిని ప్రజలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుజాత, జీఎంసీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్, వైద్యులు డాక్టర్ నిహారిక, డాక్టర్ సుమన, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపిక

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్‌లోని సెంట్రల్ స్కూల్ విద్యార్థి తాడిమర్రి సంహిత జాతీయ స్థాయి సాఫ్ట్‌టెన్నిస్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 3 నుంచి 4వ తేదీ వరకు వైఎస్సార్ జిల్లా పులివెందులలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి ఏపీ స్కూల్‌గేమ్స్ అండర్–14 విభాగంలో ప్రతిభ చాటిన ఆమె మూడో స్థానం దక్కించుకుని డిసెంబర్‌లో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఏపీ తరపున ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా ఆమెను ఎస్జీఎఫ్ సెక్రెటరీ సుగుణమ్మ అభినందించారు.



సంహిత

తల్లీ... నిను వీడి ఉండలేను

- బుధవారం చోటు చేసుకున్న ప్రమాదంలో తండ్రి, కుమార్తెకు తీవ్ర గాయాలు
- బెంగళూరుకు తరలిస్తుండగా కుమార్తె మృతి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి తండ్రి కూడా...



రమేష్ (ఫైల్)

పెనుకొండ రూరల్: తాను ఎక్కడున్నా.. కుమార్తెలు బాగుండాలని పరితపించాడు. వారి అభ్యున్నతి కోసం బాటలు వేశాడు. క్రీడలపై మక్కువ పెంచుకున్న పెద్ద కుమార్తెను జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగేలా ప్రోత్సహించాడు. ఈ శుభ పరిణామాన్ని భార్య, మరో కుమార్తెతో పంచుకుని సంబరపడాలనుకున్న ఆయన ఆనందం క్షణాల్లోనే ఆవిరైంది. బొలెరో రూపంలో దూసుకొచ్చిన మృత్యువు కుమార్తెను కబలించగా... కుమార్తె జ్ఞాపకాలతో తల్లీ... నిను వీడి నేను ఉండలేనంటూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తండ్రి కూడా మరణించాడు. ఈ ఘటనతో పెనుకొండలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బిడ్డలే సరస్వమూ అనుకుని...

ధర్మవరానికి చెందిన రమేష్ రొద్దంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పీఈటీగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తన విధులకు సౌకర్యవంతంగా ఉండేలా భార్య మల్లిక, కుమార్తెలు సాయి భవిత (15), తనుశ్రీతో కలసి పెనుకొండలో నివాసం ఏర్పరుచుకున్నారు. బిడ్డలే తన సరస్వంగా భావించిన తల్లిదండ్రులు వారిని ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటూ వచ్చారు. పెనుకొండలోని శాంతినికేతన్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పెద్ద కుమార్తె సాయిభవితకు హాకీ క్రీడపై మక్కువ ఉండడంతో ఆ దిశగా ప్రోత్సహించారు. దీంతో క్రీడల్లో ఆమె రాణించి నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈ పోటీల్లో రాణించిన సాయి భవిత జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో దక్కించుకుంది. దీంతో ఎంతో సంతోషపడిన తండ్రి, కుమార్తె మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రైలులో ధర్మవరానికి చేరుకున్నారు. రాత్రి అక్కడే పడుకుని బుధవారం ఉదయం పెనుకొండకు ద్విచక్రవాహనంపై వస్తుండగా మార్గ మధ్యంలో గుట్టూరు వద్ద వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో తండ్రి, కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉన్న సాయి భవితను బెంగళూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందింది. అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమేష్(40) కూడా బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందాడు. విషయం తెలియగానే పెనుకొండలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మృతదేహాలను ధర్మవరానికి తరలించి అక్కడే అంత్యక్రియలకు బంధువులు ఏర్పాటు చేశారు.

ప్రతిపాదనలు కాదు... నిధులు రాబట్టాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



అనంతపురం అర్బన్: జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధికి అధికారులు ప్రతిపాదనలకే పరిమితం కాకూడదని, అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి రాబట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఏబీఆర్‌ను 11.10 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని నిర్ణయించి మూడు దశాబ్దాలైనా నేటికీ మా దిశగా కార్యాచరణ చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మరోసారి పీఏబీఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. 1994లో ప్రారంభమైన ఈ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యానికి తగినట్లుగా భూసేకరణ ఇప్పటికీ జరగలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప లక్ష్యం నెరవేరలేదన్నారు. ఈ రిజర్వాయర్‌లో 11 టీఎంసీలు నిల్వ చేసుకుంటే 1.50 లక్షల ఎకరాలకు నీటి భద్రత కల్పించవచ్చన్నారు. ఈ నెలలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో ఇందుకు అవసరమైన నిధులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. ఉంతకల్లు వద్ద రిజర్వాయర్ నిర్మించాలని 15 ఏళ్ల క్రితం చేసి ప్రతిపాదనలనూ ఈ బడ్జెట్‌లోనైనా పూర్తి చేయాలన్నారు. లేదంటే ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు.

గ్రానైట్ పరిశ్రమలో కార్మికుడి మృతి

తాడిపత్రి రూరల్: స్థానిక సజ్జలదిన్నె వద్ద ఉన్న గోపాలరెడ్డి గ్రానైట్ పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ పీఎస్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా మొలకలచెరువు తండాకు చెందిన రమేష్ నాయక్ (33) ఐదేళ్ల క్రితం కుటుంబంతో కలసి తాడిపత్రికి వలస వచ్చాడు. గోపాలరెడ్డి గ్రానైట్ పరిశ్రమలో కార్మికుడి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పనిలో నిమగ్నమై ఉండగా కటింగ్ మిషన్ ఒక్కసారిగా స్తంభించింది. దీంతో దానిని సరిచేస్తుండగా గుండు అదుపు తప్పి రమేష్ నాయక్ ఛాతీని బలంగా తాకింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మళ్లీ 'అనంత'దే అగ్రస్థానం

- మార్కెట్ ఫీజు వసూళ్లలో కొనసాగుతున్న దూకుడు
- కేవలం 18 శాతంతో వెనుకబడిన 'రాప్తాడు'



అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్‌శాఖ నిర్దేశించిన ఫీజు వసూళ్లలో అనంతపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ దూకుడు కొనసాగిస్తోంది. ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా వివిధ రూపాల్లో రూ.12.06 కోట్ల వసూళ్ల టార్గెట్ ఇచ్చారు. అయితే ఏడు నెలలు ముగిసిన తర్వాత అక్టోబర్ నెలాఖరుకు 46 శాతంతో రూ.5.54 కోట్లు వసూళ్లు జరిగాయి. కాగా, గతేడాదితో పోల్చుకుంటే ఈ సారి రూ.78 లక్షల వరకు ఆదాయం తగ్గింది. గతేడాది పంటలు పూర్తిగా దెబ్బతిన్నా... ఇదే సమయానికి రూ.6.32 కోట్లు సాధించడం విశేషం.

వంద శాతం కష్టమే

మార్కెట్ కమిటీల్లో ఫీజు వసూళ్లపై ప్రతి నెలా ఆ శాఖ ఆర్జేడీ సమీక్షిస్తున్నా ఆశించిన మేర లేకపోవడం గమనార్హం. ఓవరాల్‌గా తీసుకుంటే ఈ ఏడాది అనంతపురం, శింగనమల లక్ష్యం దిశగా పయనిస్తుండగా మిగిలిన కమిటీల పరిస్థితి దారుణంగా కనిపిస్తోంది. అందులోనూ రాప్తాడు, గుత్తి, గుంతకల్లు కమిటీల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. లక్ష్య సాధనలో గత మూడేళ్లుగా వంద శాతం సాధించి అవార్డు దక్కించుకున్న 'అనంత' మార్కెటింగ్ శాఖ లోనూ ఈసారి నిరాశాజనక ఫలితాలు కనిపిస్తున్నాయి. వివిధ రూపాల్లో పన్నులు, ఆదాయం పెంచుకునేందుకు మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి నేతృత్వంలో విజిలెన్స్ బృందం ఏర్పాటై తనిఖీలు చేపడుతున్నా అనుకున్న ఫలితాలు సాధించకపోవడం గమనార్హం.

నిర్దేశించిన లక్ష్యం, వసూళ్లు ఇలా...

మార్కెట్ కమిటీ	లక్ష్యం	వసూలైంది	శాతం
అనంతపురం	రూ.4.60 కోట్లు	రూ.2.83 కోట్లు	62
శింగనమల	రూ.1.02 కోట్లు	రూ.50.91 లక్షలు	50
తాడిపత్రి	రూ.2.02 కోట్లు	రూ.84.88 లక్షలు	42
ఉరవకొండ	రూ.90 లక్షలు	రూ.29.44 లక్షలు	35
కళ్యాణదుర్గం	రూ.61 లక్షలు	రూ.16.94 లక్షలు	33
గుంతకల్లు	రూ.65 లక్షలు	రూ.19.68 లక్షలు	30
గుత్తి	రూ.29 లక్షలు	రూ.7.23 లక్షలు	25
రాప్తాడు	రూ.53 లక్షలు	రూ.9.89 లక్షలు	18

గంజాయి ముఠా గుట్టు రట్టు

- 11 మందిని అరెస్టు చేసిన పోలీసులు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రమణమూర్తి

అనంతపురం: గంజాయి ముఠా గుట్టును అనంతపురం పోలీసులు రట్టుచేశారు. మొత్తం 11 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 20 కిలోల గంజాయి, ఓ కారు, రెండు బైకులు, 11 సెల్‌ఫోన్లు, రూ.2,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి మీడియాకు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం కొరపాట్ జిల్లాకు చెందిన దిలీప్ బంక ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లో ప్రాంతంలో పండించిన గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆల్టో కారులో అక్రమంగా అనంతపురం తెచ్చేవాడు. కిలో గంజాయి రూ.5 వేల ప్రకారం నగరంలో 10 మందితో కూడిన ఓ ముఠాకు విక్రయించేవాడు. వారు గంజాయిని జిల్లాలోని మిగతా ప్రాంతాలకు విక్రయిస్తున్నారు. చిన్న,చిన్న ప్యాకెట్లుగా మార్చుకుని 20 గ్రాముల పాకెట్‌ను యువత, కళాశాల విద్యార్థులకు రూ.500 ప్రకారం అమ్మి సొమ్ము చేసుకునేవారు. ఇటీవల అరెస్టు అయిన వజ్రకరూరు మండలం తట్రకల్లు నేతాజీ ద్వారా దిలీప్ బంక వ్యవహారాలు నడిపేవాడు. ఈ క్రమంలో నేతాజీ ఇచ్చిన సమాచారంతో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. నాలుగో పట్టణ సీఐ కే. సాయినాథ్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం గురువారం ప్రసన్నాయ పల్లి పరిధిలోని సంగమిత్ర కాలని సమీపంలో దిలీప్ బంకతో పాటు జిల్లాకు చెందిన ముఠాను అరెస్ట్ చేశారు.

అరెస్ట్ అయిన వారు వీరే..

సాకే వినయ్‌కుమార్ అలియాస్ తలకాయ అలియాస్ విన్ని, నవోదయ కాలనీ అనంతపురం, సయద్య జబ్బర్ అలియాస్ దుబ్బి, డ్రైవర్స్ కాలనీ, అనంతపురం, యం. రమేష్ అలియాస్ రమ్మి, మారుతీ నగర్, అనంతపురం. సి. భాస్కర్, కసాపురం రోడ్డు, గుంతకల్లు, పప్పూరు జయరాం, తపోవనం, అనంతపురం, సురేష్ బాబు, నందమూరి నగర్, అనంతపురం, అహ్మద్ ఫర్హన్, రాణి నగర్, అనంతపురం, అప్పేచర్ల మహేంద్ర అలియాస్ మహి, రాణి నగర్, అనంతపురం, చవిటీ ప్రదీప్, గుత్తి రోడ్డు, అనంతపురం, తిమ్మాపురం ఇమామ్ బాషా, జనశక్తి నగర్, అనంతపురం.

మోటార్ దొంగ అరెస్ట్

బెళుగుప్ప: బోరుబావులకు అమర్చిన మోటార్లను అపహరించుకెళుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్ఐ శివ గురువారం వెల్లడించారు. బెళుగుప్ప మండలం జీడిపల్లి, అంకంపల్లి, రామసాగరం తదితర గ్రామాల్లో కొన్ని నెలలగా బోరుబావులకు అమర్చిన మోటార్లు, కేబుల్, స్టార్టర్ బాక్స్‌లు అపహరణకు గురవుతూ వచ్చాయి. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు... గురువారం హనిమిరెడ్డిపల్లి వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న కాలువపల్లి గ్రామానికి చెందిన దూదేకుల అన్వర్ బాషాను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మోటారు దొంగతనాలు వెలుగు చూశాయి. దీంతో నిందితుడి నుంచి 230 మీటర్ల కేబుల్, స్టార్టర్ బాక్స్, నాలుగు మోటార్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

తిరుపతిలో భట్టువానిపల్లి నివాసి మృతి

- పోలీసుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని బంధువుల ఆరోపణ

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని భట్టువానిపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు(36) తిరుపతిలో రైలు పట్టాలపై పడి మృతిచెందాడు. వివరాలు....నాలుగు రోజుల క్రితం తిరుమలలో దైవ దర్శనం కోసం వెళ్లిన ఆంజనేయులుకు మతి భ్రమించింది. దీంతో తిరుపతిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైకి ఎక్కి దూకుతానంటూ హంగామా చేశాడు. ఈ అంశం కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకుని కళ్యాణదుర్గం పోలీసులకు సమాచారం అందించారు. ఇక్కడి పోలీసుల నుంచి సమాచారం అందుకున్న భట్టువానిపల్లిలోని ఆయన కుటుంబసభ్యులు గురువారం తిరుపతికి చేరుకున్నారు. వారు అక్కడకు వెళ్లే సమయానికి ఆంజనేయులను తిరుపతి పోలీసులు వదిలేయడంతో నేరుగా రైల్వే స్టేషన్‌కు చేరుకుని పట్టాలపై తలపెట్టి పడుకున్నాడు. అదే సమయంలో రైలు రావడంతో తల, మొండం వేరయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తిరుపతి పోలీసుల నిర్లక్ష్యంతోనే ఆంజనేయులు మృతి చెందాడంటూ బంధువులు ఆరోపించారు. కాగా, ఆంజనేయులకు భార్య శివమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

క్లుప్తంగా

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

ఆత్మకూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోగలరని ఎస్ఐ లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మత్తుతో భవిష్యత్తు చిత్తు అవుతుందని తెలిపారు. సమాజంలో గౌరవం ఉండదన్నారు. మత్తు పదార్థాల వల్ల అనారోగ్యంతో పాటు జీవితాలు నాశనం అవుతాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసుకోరాదని విద్యార్థినులకు సూచించారు. బాల్య వివాహాలు చేసినా ప్రోత్సహించినా శిక్షార్హులని వెల్లడించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు షేక్ సర్దార్ షబానా, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న రెడ్డి వివాహ పరిచయ వేదిక

రాప్తాడు రూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10న 'రెడ్డి వివాహ పరిచయ వేదిక' ఏర్పాటు చేస్తున్నారు. అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు పాపంపేట (బీఎస్ఎన్ఎల్ టవర్ వెనుక) సంఘం కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం ఫౌండర్ రొద్దం సురేష్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు చంద్రమౌళిరెడ్డి, కార్యదర్శి కిషోర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నూతన వధూవరుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 94415 75641, 93902 84296, 94907 67224 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.


రైఫిల్ పోటీల్లో ప్రతిభ



తీక్షన్ సాయిని అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాల 9వ తరగతి విద్యార్థి వి.తీక్షన్ సాయి అండర్–14 విభాగం రాష్ట్రస్థాయి రైఫిల్ పోటీల్లో ప్రతిభ చాటాడు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాడు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ తబస్సుమ్ అభినందించారు. కార్యక్రమంలో ఏఓ గోపాల్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు రక్త పరీక్షలు



అంగన్‌వాడీ కేంద్రంలో రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీ ఇందిరమ్మ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు వైద్య సిబ్బంది రక్త పరీక్షలు చేశారు. హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించి, రక్తశాతం తక్కువ ఉన్న పిల్లలకు రక్తం వృద్ధి చెందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న, ఏఎన్ఎం చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్త యల్లమ్మ, అంగన్‌వాడీ సహాయకురాలు విజయలక్ష్మి, ఆశాలు శివలక్ష్మి, నాగేంద్రమ్మ, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక ఓటర్ నమోదు

రాప్తాడు: ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025లో భాగంగా ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈనెల 9, 10, 23, 24వ తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలన్నారు. ఫారం–6, ఫారం–7, ఫారం–8, 8ఏ అవసరాలు, ఓటు నమోదు అంశాలను వివరించాలని తెలిపారు. ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఆదేశించారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన యువతీ, యువకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈడీటీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రగతికి 'కూటమి' గండి?

- పూ్యరిఫికేషన్ పేరుతో మహిళా స్వయం సంఘాల సభ్యుల సమగ్ర సమాచార సేకరణ
- భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రశ్నార్థకం



మహిళా సంఘాల సమావేశం (ఫైల్)

అనంతపురం కార్పొరేషన్: మహిళా సాధికారతకు పట్టం కడుతామంటూ ఎన్నికల సమయంలో భరోసానిచ్చిన కూటమి పెద్దలు... అధికారం చేపట్టిన తర్వాత తమ తీరు మార్చుకున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు టీడీపీ సభ్యత్వం బలవంతంగా అంటగట్టే చర్యలు తీసుకున్నారు. తాజాగా మహిళా సంఘాల సభ్యుల కుటుంబీకుల వివరాలు, ఆర్థిక సమాచారం, తదితర విషయాలను తెలుసుకునేందుకు ఎస్‌హెచ్‌జీ పూ్యరిఫికేషన్ పేరుతో సరికొత్త కుట్రకు తెరలేపారు. ఈ నెల 8 నుంచి 30వ తేదీలోపు సంఘం సభ్యుల వివరాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో పొందుపర్చనున్నారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఇప్పటి వరకూ సదరు మహిళలకు అందుతున్న ప్రభుత్వ పథకాలకు ఎసరు పడే అవకాశం లేకపోలేదని నగరపాలక సంస్థ వర్గాలంటున్నాయి.

పూ్యరిఫికేషన్ పేరిట బురిడీ

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలు/స్లమ్ సమాఖ్యల పటిష్టత పేరుతో పూ్యరిఫికేషన్ కార్యక్రమానికి కూటమి సర్కార్ తెరలేపింది. సంఘాలు, సభ్యురాళ్ల సమగ్ర వివరాలను సేకరించనున్నారు. 2007లో గ్రూపులు ఏర్పాడ్డాయని, అప్పటి నుంచి పూ్యరిఫికేషన్ చేపట్టలేదని, మరణించిన వారు, వలస వెళ్లిన వారు, యాక్టివ్‌గా లేని వారు, తదితర కారణాలను చూపుతూ సంఘాల ప్రక్షాళనకు రంగం సిద్ధం చేశారు. జిల్లాలోని అనంతపురం, గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం మునిసిపాలిటీల పరిధిలో 11,471 సంఘాలుంటే 1,15,623 మంది సభ్యులున్నారు. వీరందరి సమగ్ర వివరాలను ఆర్పీలు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ ద్వారా నమోదు చేయనున్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్, కుటుంబ సభ్యుల వివరాలు, వారు ఏం విధులు నిర్వర్తిస్తున్నారు, తదితర సమాచారాన్ని తీసుకోనున్నారు. ఒక్కో ఆర్పీ రోజూ రెండు సంఘాల సమాచారాన్ని తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒక్కో ఆర్పీ పరిధిలో 25 నుంచి 40 సంఘాలుంటాయి.

పథకాలకు ఎసరు..

కూటమి ప్రభుత్వం ఏర్పాటై దాదాపు ఐదు నెలలు అవుతోంది. ఇప్పటికే హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇటువంటి తరుణంలో మహిళా సంఘాల సభ్యురాళ్ల ఖాతాల వివరాలను తీసుకుని వార్షిక ఆదాయం అధికంగా ఉంటే వాటిని కోత పెట్టే యోచనలో సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఎంతో మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడే అవకాశం లేకపోలేదని మెప్మా కార్యాలయ వర్గాలంటున్నాయి.

నెలాఖరులోగా పూ్యరిఫికేషన్

మహిళా సంఘాలు ఏర్పడి చాలా ఏళ్లవుతోంది. మహిళా సంఘాల్లో ఎంతో మంది స్థానికంగా లేకపోవడంతో పాటు మరణించిన వారూ ఉన్నారు. వారందరినీ తొలగించి కొత్త వారికి అవకాశం కల్పించాలని పూ్యరిఫికేషన్ కార్యక్రమానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెలాఖరులోపు ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నాం.

– విశ్వజ్యోతి, పీడీ, మెప్మా

సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండా గ్రామసభ

- అనంతపురం రూరల్ మండలం కాటిగాని కాలువలో ప్రొటోకాల్‌కు మంగళం

రాప్తాడు రూరల్: గ్రామసభ సాక్షిగా అనంతపురం రూరల్ మండలం కాటిగానికాలవ సర్పంచ్ శీలక శారదకు అవమానం జరిగింది. ఉపాధి పనులను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన గ్రామసభలో సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకుండానే కొనసాగించడం చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థల ప్రతినిధులకు ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదు. ఇదే విషయమై ఇటీవల అనంతపురం రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఏకరువు పెట్టారు. ప్రభుత్వం మారితే స్థానిక ప్రజాప్రతినిధులు కూడా మారినట్లు గ్రామాల్లో అధికారులు వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ఏ పదవులూ లేని టీడీపీ కార్యకర్తలను కూర్చొబెడుతున్నారన్నారు. పదవుల్లో ఉన్న తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదంటూ మండిపడ్డారు. తాజాగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024–25 ఆర్థిక సంవత్సరంలో కొత్త పనులను గుర్తించేందుకు బుధవారం అనంతపురం రూరల్ మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లోనూ గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కాటిగాని కాలవ పంచాయతీలోనూ జరిగింది. అయితే సర్పంచ్ శీలక శారదకు కనీస సమాచారం ఇవ్వలేదు. టెక్నికల్, అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు స్థానికంగా కొందరి టీడీపీ కార్యకర్తలతో గ్రామసభ ఏర్పాటు చేశారు. పంచాయతీ మొదటి పౌరురాలైన సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని ప్రజలు మండిపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి హిదాయతుల్లా ఐదు పంచాయతీలను పర్యవేక్షిస్తున్నారు. ఆయన ఇతరచోట్ల జరిగిన గ్రామసభలకు హాజరుకావడం వల్ల ఇక్కడికి రాలేకపోయారు. అయితే సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ కూడా సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండానే గ్రామసభ నిర్వహించారు. ఇదేనా కూటమి ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులకు ఇస్తున్న గౌరవం? అనే ప్రశ్న తలెత్తుతోంది. సర్పంచ్ శీలక శారద మాట్లాడుతూ.. పంచాయతీలో ఉపాధి పనులపై 'గ్రామసభ' పెడుతున్నారనే విషయం తనకు తెలియదన్నారు. ఎవరూ నాదృష్టికి కూడా తీసుకురాలేదని తెలిపారు.

ఇదెక్కడి ప్రభుత్వం.. ఇంత దౌర్జన్యమా?



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులతో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు రాజ్యాంగ విలువలను హరించేలా ఉంది. ఇదెక్కడి ప్రభుత్వం .. ఇంత దౌర్జన్యామా అని మేయర్ వసీం ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గురువారం కడప కౌన్సిల్ సమావేశంలో మేయర్‌కు జరిగిన అవమానాన్ని ఖండించారు. మేయర్ కూర్చున్న స్థానం వద్దకు వెళ్లి ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడిన తీరును పరిశీలిస్తుంటే రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కొనసాగుతుందా లేక రెడ్ బుక్ రాజ్యాంగం కొనసాగుతోందా అనే అనుమానం కలుగుతోందన్నారు. అధికారం ఉంది కదా అని తాను కూడా మేయర్ పక్కన కూర్చుంటా అని శాసన సభ్యురాలు మాధవి రెడ్డి వ్యవహరించిన తీరు సరికాదన్నారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి కేవలం తమ అధికారాన్ని చలాయించాలని చూస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులకు చట్టాలంటే కనీస గౌరవం కూడా లేదన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే, ఎంపీ ఇతర ఉన్నత ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో వారికి కౌన్సిల్ సమావేశంలో ఎక్స్ అఫిషియల్ మెంబర్లుగా తొలివరుసలో కూర్చునేందుకు అవకాశం కల్పిస్తారన్నారు. దీనిని పూర్తిగా పక్కన పెట్టి మేయర్ పక్కన సీటు వేయాలని కోరడం రాజ్యాంగాన్ని పూర్తిగా అగౌరవపరచడమేనని తెలిపారు. నగర ప్రథమ పౌరుడైన మేయర్‌ను అవమానించే అట్లే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారన్నారు.

'భక్తులకు సౌకర్యాలు కల్పించండి'

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడున్న జిల్లా అధికారులు

ఆత్మకూరు: కార్తీక మాసం సందర్భంగా పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు, రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవనాయుడు ఎండోమెంట్ అధికారులకు సూచించారు. పంపనూరు ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో గురువారం సాక్షి దినపత్రికలో 'ఆదాయం ఘనం.. సౌకర్యాలు శూన్యం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గురువారం పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్తీకమాసంలో ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుధ్య పనులపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఈఓ బాబు, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయంలో పారిశుధ్య పనులు

సాక్షిలో వచ్చిన కథనానికి ఆలయ సిబ్బంది స్పందించారు. గురువారం ఆలయంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగు నీటిని తొలగించారు. చెత్తను ఎత్తేశారు. భక్తులు ఇబ్బంది పడకుండా త్వరలో రేకుల షెడ్లు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

'104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'



డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: జిల్లాలోని 104 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆ ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవికి వినతిపత్రం అందించారు. 3 నెలలుగా వేతనాలు రావడం లేదని తెలిపారు. 104 నిర్వహణ ప్రాథమిక కేంద్రాల ఆధ్వర్యంలోనే జరగాలన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోశాధికారి కిషోర్, సహాయ కార్యదర్శి సురేష్, డీఈఓలు మానస, శాంతి, భాను, షబానా, మహ్మద, మహబూబ్ పీరా, నరహరి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: 104 ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఆ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, డీఈఓ మానస పేర్కొన్నారు. 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ విజయకుమారి, వైద్యాధికారి శివకృష్ణకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. డీఎస్సీ ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలన్నారు. ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించి, యాజమాన్యం నుంచి రావాల్సిన ఇతర బకాయిలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

జీవన శైలిలో మార్పు రావాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రేడియేషన్ విభాగాధిపతి డాక్టర్ జీవీ సతీష్ కుమార్

అనంతపురం: మానవ జాతిని పట్టిపీడిస్తున్న మహమ్మారిలో క్యాన్సర్ ఒకటి. జీవన శైలిలో మార్పు వచ్చినప్పుడే క్యాన్సర్ బారిన పడకుండా ఉంటామని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రేడియేషన్ విభాగాధిపతి డాక్టర్ జీవీ సతీష్ కుమార్ అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఓటీపీఆర్ఐలో గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ జీవీ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. క్యాన్సర్ నివారణ, త్వరిత గతిన లక్షణాలు గుర్తింపు, నిర్ధారణ, చికిత్సలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజనాసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే.దినకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. గోపీనాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.లహరి, ఎన్.యామిని తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో రేపు వలంటీర్ల ఆవేదన సదస్సు



మాట్లాడుతున్న ఏపీవీఏ జిల్లా కన్వీనర్ సంతోష్

అనంతపురం అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా 2.60 లక్షల మంది వలంటీర్లకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో విజయవాడలో ఈనెల 9న వలంటీర్ల ఆవేదన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ వలంటీర్ల అసోసియేషన్ జిల్లా కన్వీనర్ సంతోష్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వలంటీర్లు పెద్దసంఖ్యలో పాల్గొని సదస్సు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగించి.. రూ.10 వేల వేతనం ఇస్తామంటూ చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి నాలుగు నెలలు గడిచినా ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఎనిమిది క్యాబినెట్ సమావేశాలు జరిగినా వలంటీర్ల కొనసాగింపు అంశంపై చర్చించకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, మోహన్‌కృష్ణ, వలంటీర్లు నందు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సదస్సు

అనంతపురం: జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలోని కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఆధునిక కంప్యూటింగ్ (సూపర్ కంప్యూటింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అంశంపై నిర్వహించిన సదస్సు ముగింపు కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సదస్సుకు హాజరైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఇలాంటి సదస్సుల వల్ల నైపుణ్యాలు అలవడుతాయని పేర్కొన్నారు.


సంధ్యా సమయం.. ఆహ్లాదమయం



ప్రకృతిలో అందంగా ఉండని పువ్వు ఉండదు. ఒక్కోపువ్వు ఒక్కో రకం అందం. దేనికదే సాటి. పూల ప్రపంచంలో ఎన్నో రకాల పుష్పాలు ఉన్నాయి. మనస్సు దోచుకునే చిన్ని చిన్ని పూలజాతి మొక్కలు ప్రకృతిని మరింత అందంగా మారుస్తున్నాయి. పూలలోని మకరందాన్ని సేకరించేందుకు తేనేటీగలు వాలుతున్న దృశ్యం ఆకట్టుకుంది. గురువారం సూర్యాస్తమయ సమయంలో నగర శివారులో తేనెటీగలు, సీతాకోక చిలుకలు పూల మకరందం కోసం తిరుగుతున్న దృశ్యాలు సాక్షి కెమెరాకు చిక్కాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:







వేటకొడవలి స్వాధీనం

అనంతపురం: నగరంలో ఓ వ్యక్తి వద్ద ఉన్న వేటకొడవలిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు. ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన తిమ్మిరెడ్డి ఉమామహేశ్వర రెడ్డి జేఎన్‌టీయూ రోడ్డులో తన స్నేహితులతో కలిసి ఉండగా అతడి వద్ద వేటకొడవలి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వేటకొడవలిని స్వాధీనం చేసుకున్నారు. కాగా.. తిమ్మిరెడ్డి ఉమామహేశ్వర రెడ్డి గతంలో తన స్నేహితులతో కలిసి చిన్న చిన్న దందాలకు పాల్పడేవాడు. రామగిరి, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అతడిపై కేసులు నమోదయ్యాయి.

వ్యక్తికి తీవ్ర గాయాలు

అనంతపురం: నగరానికి చెందిన గోవిందు అనే వ్యక్తికి రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు అయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మున్నా నగర్‌కు చెందిన వెంకటేశులు కుమారుడు గోవిందు (29) బుధవారం రాత్రి కలెక్టరేట్ కార్యాలయం వద్ద బైక్ అదుపుతప్పిన ఘటనలో కింద పడిపోయాడు. హుటాహుటిన అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. గోవిందుకు బ్రెయిన్ డెడ్ అయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

పరామర్శ



ఎంపీడీఓ బాలాజీని పరామర్శిస్తున్న జెడ్పీ సీఈఓ వెంకట సుబ్బయ్య

అనంతపురం సిటీ: విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదానికి గురైన కుందుర్పి ఎంపీడీఓ హరికృష్ణ బాలాజీని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి (సీఈఓ) వెంకటసుబ్బయ్య గురువారం పరామర్శించారు. అనంతపురం సమీపంలోని ఉప్పరపల్లె వద్ద ఉన్న ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జరుగుతున్న ఎంపీడీఓ శిక్షణ తరగతులకు ఎంపీడీఓ హరికృష్ణ బాలాజీ బుధవారం ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలో కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పిన ఘటనలో బాలాజీ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం అతడ్ని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న సీఈఓ వెంకటసుబ్బయ్య ఆస్పత్రికి వెళ్లి ఎంపీడీఓను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఆత్మకూరు: కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా పంపనూరులోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామికి కల్యాణం జరిపించారు. తొలుత సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, పండితుల వేద మంత్రాల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి మూల విరాట్‌ను అలంకరించి అభిషేకాలు, పూజలు చేసి మహామంగళహారతి అందించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈలయ ఈఓ బాబు, అర్చకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అర్చకుడి మృతి



పూజారి ఓబుళపతి (ఫైల్)

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన ఆంజనేయ స్వామి ఆలయ అర్చకుడు పూజారి ఓబుళపతి గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పూజారి ఓబుళపతి మూడు రోజుల క్రితం గుండెపోటుతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం తెల్లవారుజామున మళ్లీ గుండెపోటు రావడంతో మరణించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఓబుళపతి స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. 1983–84 బ్యాచ్ పదో తరగతికి చెందిన వారు వచ్చే ఆదివారం సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. ఇంతలోనే ఓబుళపతి అకాల మరణం చెందడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఓబుళపతి మృతదేహానికి నివాళులర్పించారు.

డిసెంబర్ 8న భగవద్గీత కంఠస్థ పోటీలు

అనంతపురం కల్చరల్: గీతాజయంతిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానాలు హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో డిసెంబర్ 8వ తేదీన భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ జిల్లా కార్యక్రమ నిర్వాహకులు బాబు, పండిట్ వేణు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. టీటీడీ కల్యాణ మండపం వేదికగా సాగే పోటీల్లో ఈ ఏడాది శ్రీమద్భగవద్గీతలో ఆరవ అధ్యాయమైన 'ఆత్మ సంయమ యోగం'పై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. గీతా ప్రచారం కోసం 6, 7 తరగతుల వారిని మొదటి గ్రూపుగా 8, 9, 10 తరగతుల వారు రెండో గ్రూపుగా విభజించామన్నారు. అలాగే సంపూర్ణంగా 18 అధ్యాయాలు, 700 శ్లోకాలు వచ్చిన వారిని మూడవ గ్రూపుగా, 18 ఏళ్లు పైబడిన వారు నాల్గవ గ్రూపుగా విభజించి వేర్వేరుగా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9492325020 నంబర్‌లో లేదా రామచంద్ర నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో సంప్రదించాలన్నారు.